بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ نَحْمَدُہٗ وَنُصَلِّی عَلٰی رَسُوْلِہِ الْکَرِیْمِ وَعَلٰی عَبْدِہِ الْمَسِیْحِ الْمَوْعُوْدِ

**Summary of Friday Sermon Huzur-e-Anwar 13.02.2015 (Telugu)**

**పదే పదే సూచించినను, తరచుగా ఆదేశించినను సామూహిక నమాజ్ పట్ల అధికులకు ఉత్సాహము కలగలేదు. ఒక విధముగా ఇది జాతీయ వ్యాధిగా మారుచున్నది. కనుక చాలా గట్టిగా దీని చికత్స అవసరమున్నది. ఫలానా వ్యక్తి నమాజ్ కొరకు మస్జిద్‌నకు రాలేదనేది వ్యక్తిగత లోపము కాదు. నిర్లక్ష్యము వలన ఇది జాతీయ వ్యాధి, లోపముగా మారుచున్నది. ప్రరిస్థితుల వలన కలిగించిన సౌకర్యము సామూహిక నమాజ్ ప్రాధాన్యతను తగ్గించినది.**

*హజ్రత్ అమీరుల్ ముమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ 13.02.2015 తేదీన మస్జిద్ బైతుల్ ఫుతూహ్ - లండన్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము*

తషహ్హుద్, తఅవ్వుజ్, తస్మియ, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ప్రసంగించిరి.

హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు తఆలా అన్‌హు ఒక సారి జాతీయ లోపములు, బలహీనతల గురించి ఒక ఖుత్బా ప్రసంగించిరి. అందులో ఆ బలహీనతల కారణము, వాటితో దూరముండుటకు జమాఅత్‌నకు సూచనలిచ్చిరి. ఈ అంశము నేడు కూడ అవసరమున్నది. అందుకే దానితో లబ్ధి పొందుచు నేడు ఈ అంశమును తీసుకున్నాను.

ఎప్పుడైనా లోపములు, బలహీనతలు రెండు రకాలుగా యుండును. ఒకటి వ్యక్తిగత లోపములు, బలహీనతలు, మరొకటి జాతీయ లోపములు, బలహీనతలు. ఇటులనే విశిష్టతలు కూడ రెండు రకాలు. ఒకటి వ్యక్తిగత విశిష్టతలు, మరొకటి జాతీయ విశిష్టతలు. వ్యక్తిగత లోపములనగా అవి వ్యక్తులలో యుండును కాని జాతిపరంగా జాతిలో యుండవు. ఇదే విధముగా విశిష్టతలు కూడ వ్యక్తులలో యుండును కాని జాతిపరంగా జాతిలో యుండవు. వ్యక్తులు తమ విద్య, తమ ప్రయత్నముతో పలు విశిష్టతలను కల్పించుకొందురు. ఇటులనే లోపముల కారణములు కూడ వ్యక్తులు తమ పరిస్థితులు, సమాజము వలన తమలో కల్పించుకొందురు. దుష్కార్యము, సత్కార్యము గురించి గుర్తుంచుకొనుము! దుష్కార్యము, సత్కార్యము లేదా లోపము, విశిష్టత తమ సమాజ ప్రభావముల వలన ఏర్పడును. దీని ఉదాహరణ ఇట్లు గలదు. ఒక విత్తనము భూమి లేనిదే మొలకెత్తదు, ఒక విత్తనముతో సరైన రీతిలో లబ్ధి పొందాలంటే అందుకు భూమి లేదా భూమి వంటి వాతావరణము అవసరమగును. లేనిచో విత్తనము మొలకెత్తినా కొంత కాలములోనే మరణించి అంతమగును. ఇటులనే దుష్కార్యము, సత్కార్యము లోపములు, విశిష్టతల వలన ఏర్పడును. ఇరుగు పొరుగు ప్రభావములు ఒక ప్రత్యేక భూమి ఏర్పాటు చేయనంత వరకు ఆ దుష్కార్యము లేదా సత్కార్యము మొలకెత్తదు. వాతావరనము కూడ రెండు రకాలలో యుండును. ఒకే వాతావరణము అందరిని ఒకేలా ప్రభావితము చేయుట అనివార్యము కాదు. ఒకే రకమైన వాతావరణము వ్యక్తులను ప్రభావితము

చేయును, జాతిపరంగా ప్రతి ఒక్కరిని అది ప్రభావితము చేయలేదు. దీని ఉదాహరణ ఒక రకమైన ప్రత్యేక పంటలు పండే భూమి వలె గలదు. హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఇందుకు ఒక ఉదాహరణ ఇచ్చిరి. భారత దేశములో జాఫ్రాన్ పండును, కాని మొత్తం భారత్‌లో పండదు. ఇది కాశ్మీర్‌లో పండును. ఉత్తమ నాణ్యత గల జాఫ్రాన్ కూడ ఒక ప్రత్యేక ప్రాంతములో పండును. అక్కడ పాకిస్తాన్‌లో కూడ సుగంధ బాస్మతి కాలర్ ప్రాంతములో మాత్రమే పండును. మరో చోట పండదు. విత్తనముపై ప్రత్యేక స్థితులు, భూమి, ఇతర వాతావరణ పరిస్థితులు ప్రభావితమగును. దీనిచో పోల్చగా రాబడిలో హెచ్చు, తగ్గులున్నను కొన్ని పంటలు ఉదా॥ గోధుమ, ప్రత్యేక తోటలు దేశమంతటా పండును.

ఈ విధముగనే సత్కార్యములు, దుష్కార్యములు కూడ కొన్ని ప్రభావముల వలన జాతీయ స్థాయిని సంతరించుకొని, పూర్తి జాతి ప్రగతి లేదా క్షీణతకు కారణమగును. వ్యక్తుల దుష్కార్యములు వ్యక్తుల కృషితో దూరము కావచ్చును. ప్రయత్నము చేసినచో దుష్కార్యములు దూరమై విశిష్టతలు కూడ ఏర్పడును. కాని జాతీయ ప్రభావము వలన ఏర్పడిన దుష్కార్యములు, సత్కార్యముల కొరకు ఒక వ్యక్తి కృషితో ఫలితము రాదు. ఎందుకనగా వ్యక్తి మొత్తములో ఒక భాగము మాత్రమే. మొత్తములో యున్న దుష్కార్యము వ్యక్తి కృషితో సంస్కరించబడదు. మొత్తములో యున్న చెడు వ్యక్తిని కూడ ప్రభావితము చేయును. ఒక ప్రాంతములో సమాజము మొత్తము చెడిపోయినచో అక్కడి నివాసులందరు ప్రభావితులగుదురు. ఉదా॥ ఒకడు విషము మ్రింగినచో ఆ విషము చేతులు, కాళ్లు, మెదడు లేదా ఇతర అవయవములను ప్రభావితము చేయకుండా వుండదు. మొత్తం శరీరమును ప్రభావితము చేయును. మనము తినుచున్న ఆహారము, మాంసము, ఫలములు మొ॥ వాటితో శరీరము మొత్తము లబ్ధి పొందును. ఎందుకనగా అ అవయవములన్నియు మొత్తం అనగా శరీరములోని భాగములే. అందుకే అవి విషములో భాగము పొందును, మంచి ఆహారములో కూడ భాగము పొందును.

మనలోని ప్రతి ఒక్కరు తమ ఆత్మ లోపములను పరిశీలించుకోవలసిన అవసరమున్నట్లే జాతిపరంగా కూడ మన బలహీనతలను పరిశీలించుకొని గుర్తించవలెను. జాతీయంగా వాటి చికిత్స చేయుచు దూరము చేయవలెను. ఈ చికిత్సలో ప్రతి ఒక్కరు తమ తమ పాత్ర పోషించవలెను. ఉమ్మడి ప్రయత్నము, ఉమ్మడి చికిత్స లేనిదే మనము సఫలము కాలేము. ఇహలోక చట్టములు, ప్రకృతి ఆపదలను చూడుము. ఒక వ్యావసాయదారుడు కట్ట కట్టి తన భూమిని వరదతో రక్షించుకోలేడు. కట్ట కట్టుట, ఇందుకు ప్రణాళిక రచించుట ప్రభుత్వ కర్తవ్యము. ఉమ్మడి ప్రయత్నము ప్రభుత్వము వైపున జరుగును. ప్రజలు ఏకమగుటను ప్రభుత్వమందురు. అర్హత లేని ప్రభుత్వములు యున్న చోట జాతి మొత్తం నష్టపోవును. కనుక సవరణకు జాతీయ జాగరూకము చాలా అవసరము.

అహ్మదియ్య జమాఅత్ దృష్ట్యా ఈ జాతీయ దుష్కార్యములను ఏ విధముగా చూడవలెను, ఏ విధముగా పరిశీలించవలెనో సూచించుచు హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఇట్లనిరి. కొన్ని కోణాలలో జమాఅత్ దీనిని గమనించి, చికిత్స చేసినచో ప్రయోజనము కలుగును. ఇందుకు అనేక మార్గములు గలవు. మొదటి మార్గము ప్రతి ఒక్కరు ఆచరించుట కర్తవ్యమని భావించే ఆ జాతిలో కొనసాగుచున్న బోధనలు. ఏదేని

ధర్మములో తప్పుడు విశ్వాసములు, విషయములున్నచో ఆ ధర్మమును విశ్వసించు ప్రతి వ్యక్తి ప్రభావితమగును. ధార్మికముగానే కాక సామాజిక జీవితములో, నాగరికత జీవితములో కూడ దుష్ఫలితములు వెలువడును. కాని ముస్లిములమైన మనము పవిత్ర ఖుర్‌ఆన్‌ను దైవశాసనముగా విశ్వసింతుము. ఈ బోధనలో ఎలాంటి లోపము లేదు, దీని దుష్ఫలితములు ఎన్నడు వెలువడవని మనము నమ్మెదము. మరి ముస్లిములందరు పాపముల నుండి దూరమున్నారా ? మనము మన పరిసరాలను చూచి, ముస్లిముల సాధారణ స్థితిని చూచినప్పుడు అధికులు పాపములలో మునిగి యున్నట్లు చూచెదము. ఖుర్‌ఆన్‌లో ఎలాంటి లోపము లేదు, పవిత్ర ఖుర్‌ఆన్ బోధన ప్రతి లోపముతో అతీతమైనది. అది సంపూర్ణ, పరిపూర్ణ బోధన. కనుక లోపము ఎక్కడున్నది ? అనే ప్రశ్న తలెత్తును. దీని సమాధానము ఏమనగా పవిత్ర ఖుర్‌ఆన్‌లో ఎలాంటి లోపము లేదు, అర్థము చేసుకొనుటలో పొరపాటు జరగినందున జాతి నష్టపోయినది. సమాజము ప్రభావితము అయ్యెను. ఇతర ధర్మముల ప్రభావము పడినది. నాగరికత ప్రభావితము చేసెను. పొరపాటుగా దానిని ధర్మములో భాగముగా భావించిరి.

అల్లాహ్ కృపానుసారము మనము హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం జమాఅత్‌లో చేరినాము. కనుక ఈ ప్రాచీన కథనములు లేదా అవివేక కథనములు, విశ్లేషణలు మనల్ని ప్రభావితము చేయలేవు, చేయకూడదు కూడ. అయినను మనము పూర్తిగా సురక్షితముగా లేము. ఎందుకనగా తమ తమ అభిప్రాయాలు గల వారు జమాఅత్‌లో ప్రవేశింతురు. కొన్ని సందర్భాలలో పలు విషయములలో వారు సందేహములో పడుదురు. నిస్సందేహముగా మనము తప్పుడు అభిప్రాయముల నుండి అల్లాహ్ కృపానుసారము పవిత్రముగా నున్నాము. కాని తమను తాము శాశ్వతముగా తప్పుల నుండి దూరముంచుకోవలసిన అవసరమున్నది. అహ్మదియేతర ముస్లిముల తప్పులను మనము సదా గమనించుచు అవి మనలో ప్రవేశించకుండా జాగ్రత్త పడుటయే ఇందుకు సరైన పద్ధతి. మన చుట్టు వుంటున్న ఇతర ధార్మికులలో ఎటువంటి జాతీయ లోపములున్నవో కూడ మనము గమనించవలసిన అవసరమున్నది. పొరుగు దేశముల వరకు ఈ పరిధిని విస్తరించవలెను. వారి విశిష్టతలు, లోపములన్నియు మనకు కనిపించును. పొరుగు రాష్ట్రముల ప్రభావము పరస్పరము పడును.

పిల్లలు యుంటున్న సమాజములోని పొరుగువారి ప్రభావము పిల్లలపై కూడ పడును. తల్లిదండ్రులు పిల్లలకు నేర్పించినను బలహీనత ఏర్పడిన చోట సమాజపు ప్రభావము పడును. పిల్లలు అధిక సమయము పాఠశాలలో ఇతర మిత్రులతో ఆడుకొనుటలో సమయము గడుపుదురు. టి.వి. ద్వారా ఇటువంటి మిత్రులు గృహములోకి నేడు ప్రవేశించుచున్నారు. ఇవి చిన్నా, పెద్దా అందరిని ఒకే రకంగా ప్రభావితము చేయుచున్నవి. ఫలితముగా పిల్లలు తల్లిదండ్రుల మాట వినుటకు సిద్ధముగా లేరు. తమ పనుల లేదా ఇతర కారణములచే తల్లిదండ్రులు స్వయముగా కూడ పిల్లలలో దూరము పెంచుచున్నారు. కొందరు స్వయముగా టి.వి. వలన వాతావరణమును కలుషితం చేయువారు కూడ యున్నారు. ఫలితముగా తల్లిదండ్రులు పిల్లలను హింసింతురు. పిల్లలు తల్లిదండ్రులను గౌరవించరు. తద్వారా వ్యక్తిగత దుష్కార్యములు జాతీయ దుష్కార్యములగుచున్నవి. కుటుంబములు నాశనమగుచున్నవి. తల్లిదండ్రులు పిల్లలను ఆధ్యాత్మికముగా హతమార్చుడమే కాక భౌతీకంగాను

హతమార్చుచున్నారు.

స్వాతంత్ర్యము పేరిట పాశ్చాత్య సమాజము వినాశనము వైపు పోవుచున్నది. ఇది జాతీయ దుష్కార్యము. దీనితో కొందరు అహ్మదీయులు కూడ ప్రభావితమగుచున్నారు. ఇది జాతీయ దుష్కార్యమై, వ్యాప్తి కాకముందే, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాంను నమ్మి మరల మూర్ఖత్వములో పడక ముందే జాతిపరంగా ఈ విషయముల నుండి దూరముండుటకు కృషి చేయవలెను. అహ్మదియ్య జమాఅత్ వ్యవస్థ భాగములన్ని దీని పరిశీలనకు ప్రణాళిక రచించి దీనిని అంతము చేయుటకు ప్రయత్నించవలెను. మనము ప్రపంచ చికిత్స బాధ్యతను తీసుకున్నాము. చికిత్స చేసేవారే రోగులైనచో ప్రపంచము నుండి వ్యక్తిగత, జాతీయ దుష్కార్యములను ఎవరు దూరము చేయుదురు ?. ఒక జాతిలో తన ప్రత్యేక స్థితుల వలన సత్కార్యములు లేదా దుష్కార్యములు పుట్టునని కూడ గమనించవలెను. హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఇందుకు ఒక ఉదాహరణ ఇచ్చిరి. అల్లాహ్ కృపానుసారము మన జమాఅత్ అన్ని చోట్ల వ్యాపించినది. అహ్మదియేతర ఇమామ్ వెనుక నమాజ్ చదవకూడదని మన జమాఅత్ విశ్వాసము. ఎందుకనగా ఈ కాలమునకు ఇమామ్‌గా చేసి అల్లాహ్ పంపిన ఇమామ్‌ను వారు విశ్వసించలేదు. నమ్మకపోవడమే కాక అతి నీచమైన భాషను ఉపయోగింతురు. కనుక అల్లాహ్ నియమించిన ఇమామ్ బదులు మరో ఇమామ్‌నకు మనము ప్రధాన్యత ఇవ్వలేము. అందుకే మనము వారి వెనుక నమాజ్ చదవము. కొందరు గృహములలో నమాజ్ చదివెదరు. అందరు కలిసి నమాజ్ చదివే బదులు విడి విడిగా నమాజ్ చదువురు. గృహములలో సామూహిక నమాజ్ చదవడంలో ఎలాంటి అభ్యంతరము లేదని నేనింతకు ముందు కూడ సూచించినాను. పనుల వలన కొందరు విడిగా తమ నమాజ్ చదువుదురు. పనుల వలన కొందరు నమాజ్ కలిపి చదివెదరు. మస్జిద్‌నకు పోవు శ్రద్ధ లేదు, మస్జిద్ సమీపములో లేదు లేదా ఇతర కారణాలు యుండవచ్చును. గృహములో నమాజ్ చదువుచున్నారు, కాని సామూహిక నమాజ్ వైపు అంత శ్రద్ధ లేదు. నమాజులను కలిపి చదివే వైపు అనవసరముగా అధిక శ్రద్ధ వహింతురు. పదే పదే శ్రద్ధ కలిగించినను, తరచుగా ఆదేశించినను సామూహిక నమాజ్ పట్ల అధికులకు ఉత్సాహము కలగలేదు. ఒక విధముగా ఇది జాతీయ వ్యాధి అగుచున్నది. కనుక చాలా గట్టిగా దీని చికత్స అవసరమున్నది. ఫలానా వ్యక్తి నమాజ్ కొరకు మస్జిద్‌నకు రాలేదనేది వ్యక్తిగత లోపము కాదు. నిర్లక్ష్యము వలన ఇది జాతీయ వ్యాధి, లోపముగా మారుచున్నది. పరిస్థితుల వలన కల్పించిన సౌకర్యము సామూహిక నమాజ్ ప్రాధాన్యతను తగ్గించినది. నిస్సందేహముగా అహ్మదీయులు గృహములలో నమాజ్ చదివెదరు, వారిలో అనేకులు చాలా భక్తి, శ్రద్ధలతో నమాజ్ చదివెదరు. బహుశా ఇతర ముస్లిములు ఇంత శ్రద్ధతో నమాజ్ చదువరు. వారిలో నమాజ్ చదివే వారు ప్రదర్శన నిమిత్తం అయినను మస్జిదునకు వెళ్లి తప్పక నమాజ్ చదివెదరు. ఇప్పుడు మస్జిదునకు వెళ్లే ఆలోచన అహ్మదియేతరులలో అధికమైనది. నమాజ్ శ్రద్ధతో చదువుతారో లేదో కాని మస్జిదునకు పోవుదురు. వారికి ఇటువైపు శ్రద్ధ కలిగినది, మనకు ఇటువైపు శ్రద్ధ తగ్గినది. నిజమైన విశ్వాసులే మస్జిదులను జనావాసముగా చేయవలెననే వైపు మన శ్రద్ధ కలుగువలెను. ప్రార్థన పేరిట అశాంతిని కలిగించే వారు కాక వర్తమాన కాలపు ఇమామ్‌ను నమ్మినవారే నిజమైన విశ్వాసులు. పిల్లల మనసులలో దీని శ్రద్ధ తగ్గుచున్నందున జాతిపరంగా మస్జిదునకు వెళ్లి నమాజ్ చదవని

లేదా నమాజులను కలిపి చదివే లోపము మరింత పెరిగే ప్రమాదమున్నట్లు మనము చూడవచ్చును. కొందరు పిల్లలు తమ తల్లిదండ్రుల స్థితులను చూచి ఒక రోజు మూడు నమాజులని అనడం మొదలు పెట్టినారు. ఐదు నమాజులని చెప్పగా మా తల్లిదండ్రులను మూడు నమాజులే చదువుచుండగా మేము చూచినాము. ఈ విషయము గురించి అన్ని చోట్ల గమనించి, ప్రణాళిక రూపొందించవలసిన అవసరమున్నది. లేనిచో భావి తరాలలో ఇది జాతీయ వ్యాధి అగును. నేడు ప్రపంచ పరిస్థితి వలన అల్లాహ్, ధర్మము నుండి ప్రజలు దూరమగుచున్నారు. మనము గట్టిగా ప్రయత్నించనిచో వివిధ రకముల దుష్కార్యములు మనలో ప్రవేశించడం మొదలగును. ఒక దుష్కార్యము వెనుక మరొక దుష్కార్యము వచ్చి, ధర్మము నామమాత్రముగనే మిగులును. స్ఫూర్తి యుండదు. ఒక ప్రాంతములో ఏదేని వ్యాధి ప్రబలినచో సురక్షితముగా యుండుటకు తప్పించుకునే ప్రణాళికలు రచింతుము. కనుక ఆధ్యాత్మిక వ్యాధలు ప్రమాదము నుండి దూరముండుటకు మనమెంతో కృషి చేయవలెను. కనుక తమను తాము ఆధ్యాత్మిక వ్యాధుల నుండి సురక్షితముగా వుంచుకొనుటకు ప్రతి దశలో జాతీయ ప్రణాళికతో జాగ్రత్త పడవలసిన అవసరముంది.

సంపూర్ణ బోధన కలిగియున్నను సమాజపు విద్యావంతులు పుట్టించిన ఈ తప్పుడు విశ్వాసములు, కర్మల మార్పు వలన అధిక ముస్లిములు దుర్మార్గములో పడిరి. ఇప్పుడు మన సంస్కరణ అనంతరం దుర్మార్గము నుండి శాశ్వతముగా దూరముండుటకు చాలా కృషి చేయవలసిన అవసరముంది. ఇతర ముస్లిములలో ఎక్కడెక్కడ లోపములు ఏర్పడి, దుర్మార్గములో పడిరి, మనమే విధముగా తప్పించుకోవలనో గమనించుచుండవలెను. హజ్రత్ మసీహ మౌవూద్ అలైహిస్సలాంను నమ్మి, వారి బోధనను తెలుసుకొనుట, దానిని ఆచరించుట ఎంతో అవసరము. పరిస్థితుల ప్రవాహములో కొట్టుకుపోయే బదులు పరిస్థితులను బోధనకు అనుగుణంగా మార్చుట మన విధి.

ఖిలాఫత్‌తో బంధమును దృఢపరచవలసిన అవసరమున్నది. ఈ కాలములో ఎమ్. టి. ఏ, జమాఅత్ వెబ్ సైట్‌లను అల్లాహ్ మనకు అందించినాడు. వీటి ద్వారా పవిత్ర ఖుర్‌ఆన్ నిజమైన బోధన, హజ్రత్ మసీహ్ విద్య, విజ్ఞానము మనకు తెలియును. వీటి ద్వారా నిజెమన ఇస్లాం బోధన మనకు లభించును. కనుక దీనితో లబ్ధి పొందవలసిన అవసరమున్నది. పవిత్ర ఖుర్‌ఆన్ వంటి సంపూర్ణ గ్రంధము ముస్లిములకు లభించినను వారిలో కొన్ని తప్పులు ప్రవేశించినందున ప్రత్యేక వ్యాధులు ఏర్పడుట తప్పనిసరి అయ్యెను. ఈ కాలములో వీటి గురించి మార్గదర్శనము కొరకు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అనేక నియమములు సూచించిరి. స్వయముగా వివరించి చెప్పినారు. వాటిని మన ముందుంచుకోవలెను. వాటి ప్రకారము పవిత్ర ఖుర్‌ఆన్ క్రొత్త క్రొత్త విషయములను అన్వేషించవలెను. ఇతర ముస్లిముల వలె గత విశ్లేషణలలోనే మనము యుండినచో హజ్రత్ మసీహ మౌవూద్ అలైహిస్సలాం సూచించిన మార్గములు, విజ్ఞానముల ద్వారములు తెరుచుకోవు. పవిత్ర ఖుర్‌ఆన్ ఒక సంపూర్ణ, పరిపూర్ణ గ్రంధమే. ఇందులో ఎలాంటి సంశయము లేదు. కాని దానిని శ్రద్ధతో చదివి, దాని బోధనను ఆచరించినవారికే సన్మార్గము లభించును. ఒక విషయమును తీసుకొని సన్మార్గము లభించినదని భావించుట సరిపోదు. ప్రతి విషయమును ఆచరించవలసిన అవసరమున్నది. ఇటుల జాతీయ, వ్యక్తిగత దుష్కార్యములు, సత్కార్యములు తెలియును. ఈ కాలములో అంతిమ కాలపు

ప్రజల కొరకు, వారి ఆలోచనలను విశాలము చేయుటకు, కాంతిని చూపించుటకు, పవిత్ర ఖుర్‌ఆన్‌ను అర్థము చేసుకొనుటకు ఒక అవతారున్ని పంపునని అల్లాహ్ ప్రకటించెను. కాని గమనించని వారు, విద్యావంతులై మూర్ఖులుగా యున్నవారు అల్లాహ్ పంపిన అవతారున్ని తిరస్కరించుచున్నారు. పవిత్ర ఖుర్‌ఆన్ జ్ఞానముల విశాలతతో దూరమున్నారు. కనుక మూర్ఖత్వములో పడి ఇస్లాంను తప్పుగా విశ్లేషించి ఇస్లాం విశిష్టతలను చూపే బదులు దానిని అపనిందకు గురిచేయుచున్నారు. ముస్లిముల కర్మలు ఇట్లు గలవు. బాహ్యముపై సంతృప్తి చెందక ఇస్లాం నిజమైన బోధనను అర్థము చేసుకుంటూ ప్రతి దుష్కార్యము జాతీయ దుష్కార్యము కాకముందు, ప్రతి సత్కార్యమును జాతీయ సత్కార్యము చేయుచు, జమాఅత్‌లో కొనసాగించుటకు మనము గతము కంటే ఎక్కువ శ్రద్ధ వహించి ఆలోచించవలెను. దుష్కార్యములు వ్యాపించక, ప్రత్యేకతలు, సత్కార్యములు కలుగుటకు మనము ఇటువంటి వాతావరణమును కల్పించి మన భావి తరాలకు అందించవలెను. అల్లాహ్ మనందరికి ఈ అనుగ్రహము కలిగించుగాక!

నమాజ్ తర్వాత హుజూర్ అయ్యదహుల్లా తఆలా రెండు ప్రత్యక్ష్య, రెండు పరోక్ష అంత్యక్రియ ప్రార్థనలు చదివించిరి.

మొదటి ప్రత్యక్ష్య అంత్యక్రియ ప్రార్థన గౌ॥ లతీఫ్ ఖాన్ గారి భార్య గౌ॥ రజ్యా ముసర్రత్ ఖాన్ గారిది. 79 సం॥ వయసులో 11 ఫిబ్రవరి 2015 తేదీన మృతి చెందిరి. اناللهواناالیہراجعون۔ అల్లాహ్ ఆమె స్థాయిని పెంచుగాక!

రెండవ ప్రత్యక్ష్య అంత్యక్రియ ప్రార్థన చి॥ ఆమిర్ షీరాజ్ తండ్రి షాహిద్ మహ్మూద్ గారు మార్డన్ సౌథ్ గారిది. కేన్సర్ వ్యాధితో 29 సం॥ వయసులో 12 ఫిబ్రవరి 2015 తేదీన మృతి చెందిరి. اناللهواناالیہراجعون۔

మొదటి పరోక్ష అంత్యక్రియ ప్రార్థన గౌ॥ అల్‌హాజ్ రషీద్ అహ్మద్ గారిది. మల్వాకి అమెరికాలో 7 ఫిబ్రవరి 2015 తేదీన మృతి చెందిరి. اناللهواناالیہراجعون۔

రెండవ పరోక్ష అంత్యక్రియ ప్రార్థన అమెరికా నివాసులే అయిన గౌ॥ హసన్ అబ్దుల్లాహ్ ఆఫ్ డిట్రాయిట్ గారిది. 30 జనవరి 2015 తేదీన మృతి చెందిరి. اناللهواناالیہراجعون۔ అల్లాహ్ వారిని క్షమించి, కరుణిచుగాక! అల్లాహ్ మృతులందరి స్థాయిలను పెచుగాక! (ఆమీన్)

✡ ✡ ✡

*Translated By : Hafiz Syed Rasool Niyaz, For : <u>Telugu</u> Desk*

From: Nazarath Nashr-O-Isha'ath, Qadian, Distt:Gurdaspur, Pin:143516, Punjab